క్లుప్తంగా

బైక్ దొంగల అరెస్ట్

డోన్ రూరల్: మండల పరిధిలోని కోట్లవారిపల్లె వద్ద మంగళవారం బైక్ దొంగలను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడాన్ని గుర్తించామన్నారు. వారిని విచారణ చేయగా బైక్ చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులు నంద్యాల శిల్పానగర్ కాలనీకి చెందిన పసుపుల దినేష్‌కుమార్, నంద్యాల టౌన్, నూతన్‌పేట కాలనీకి చెందిన షేక్ మహబూబ్‌బాషా అని వెల్లడించారు. వీరి నుంచి 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్, పాణ్యం, నంద్యాల, అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): రామానుజన్ గణిత మహోత్సవ ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించిన శాంతినికేతన్ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి మంగళవారం అభినందించారు. గత నెల నవంబర్‌లో జరిగిన రామానుజన్ గణిత మహోత్సవ ఒలింపియాడ్ పరీక్షల్లో నంద్యాల శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకును సాధించి సత్తా చాటారు. ఏడవ తరగతి విద్యార్థి పవన్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి పవన్ ప్రతిభ చాటినట్లు తెలిపారు. వారికి పతకాలు, జ్ఞాపికలను డీఈఓ అందజేశారు. చైర్మన్ సుధాకర్, ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రశ్నపత్రం లీకేజీతో అప్రమత్తం

ఉయ్యాలవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఫార్మెటివ్, సమ్మెటివ్-1 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అప్రమత్తమైంది. ఈ నెల 11వ తేదీ నుంచి జరుగుతున్న పరీక్షలకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నుంచి ప్రతి రోజూ ప్రశ్నాపత్రాలను సీల్ కవర్‌లో కాకుండా ఓపెన్‌గానే ప్రధానోపాధ్యాయులకు అందజేసేవారు. అయితే సోమవారం గణితం ప్రశ్నా పత్రం లీకయ్యింది. యూట్యూబ్‌లో పశ్నాపత్రం వైరల్ కావడంతో విద్యాశాఖ పరీక్షను రద్దు చేసింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ప్రతి రోజు ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది ప్రధానోపాధ్యాయుల చేతికి నేరుగా ప్రశ్నాపత్రాలు అందజేస్తుండగా, మంగళవారం పోలీసుల సమక్షంలో ప్రశ్నాపత్రాలను సీల్డ్ కవర్‌లో ఉంచి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్):మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్, జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్లకు సెమీ స్కిల్డ్ వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. సీఐటీయూ నాయకులు రామకృష్ణ, వెంకటశర్మ, వెంకటరమణ, పవన్, సిద్దయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

చాగలమర్రి: మండలంలోని గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని గొట్లూరు పంచాయితీకి మజరా గ్రామమైన రాజోలిలో రెవెన్యు సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి వినతులను స్వీకరించారు. సర్వేయర్ మద్దిలేటి, వీఆర్‌ఓలు పెన్నం ప్రసాద్, పద్మ శేఖర్, సుబ్బరాయుడు, విలేజ్ సర్వేయర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.44 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.44 కోట్లతో 268 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు చేపట్టినట్లు మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ సభలో డీఆర్పీ రమేష్ వెల్లడించారు. తనిఖీ నివేదికను గ్రామసభలో చదివి వినిపించారు.వాటిలో 24 చెరువుల్లో పూడికతీత పనులు, 88 పనులు ఉద్యాన మొక్కల పెంపకం, 11 పనులు మినీ గోకులం, 16 పనులు గ్రామంలో సబ్ మైనర్ కాలువలు, 2 పనులు ఫీడర్ ఛానల్, 125 పనులు రూరల్ హౌసింగ్ నిర్మాణం, 1 గొర్రెల పెంపకం షెడ్డు, 1 బౌండరీ లైన్ ప్లాంటేషన్, 4 పనులు సీసీ రోడ్లు నిర్మాణం, 1 కాంపౌండ్ వాల్ నిర్మాణం, 1 గ్రామ సచివాలయం పనులకు రూ.1.44 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏపీఓ నిర్మల, ఎఫ్ఏ నాయక్, రమణారెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

‘పది’ విజయానికి వంద రోజుల ప్రణాళిక

- ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రత్యేక తరగతులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు



మోడల్ స్కూల్‌లో స్టడీఅవర్ నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రస్తుత 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన నూతన కాలనిర్ణయ పట్టిక ప్రకారం వంద రోజుల కార్యాచరణ సిద్ధమైంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల ఒకటవ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పదిలో ఫలితాలు, మార్కులు, సాధించాలన్న సంకల్పంతో విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ముందస్తు వ్యూహాలతో సిద్ధమయ్యారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్, తరగతులు కొనసాగుతున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఆయా స్కూళ్లలో విద్యార్థులను సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు నంద్యాల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1967 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

లక్ష్యాలు

- వ్యక్తిగత సన్నద్ధతలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించాలి. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి క్రమంగా వారిని సన్నద్ధులను చేయాలి.
- ప్రత్యేక తరగతుల ద్వారా అదనపు బలాన్ని విద్యార్థులకు అందివ్వడం
- నిత్యం పబ్లిక్ తరహాలో బ్లూప్రింట్ ఆధారంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో భయాన్ని తొలగించడం
- విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, వారి సందేహాలు తీర్చి, శాస్త్రీయ అవగాహన కల్పించడం
- డీఈఓ, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ, సబ్జెక్ట్ టీచర్లు అన్ని రకాల రికార్డులు నిర్వహించడం

నిబంధనలు

వంద రోజుల ప్రణాళిక అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదే. సబ్జెక్ట్ టీచర్లతో మాట్లాడి ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి. సబ్జెక్ట్ టీచర్లపై సమాన పనిభారం ఉండేలా చూడడం, స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ, మూల్యాంకనం సకాలంలో చేసి విద్యార్థులకు ప్రగతి వివరిస్తుండాలి. క్లాసులు నిర్వహించి అసైన్మెంట్లు పెట్టి వెనుకబడిన వారిని, అటు ప్రతిభావంతులను వాళ్ల స్థాయికి తగ్గట్టుగా తయారు చే యాలి. పాఠశాల పనివేళల కంటే ఉపాధ్యాయులు రోజూ రెండు గంటలు అదనంగా సమయాన్ని కేటాయిస్తూ, సెషన్ నడిచేలా టైమ్‌టేబుల్ వేయాలి. వంద రోజుల ప్రణాళికను కచ్చితంగా తల్లిదండ్రులకు వివరించాలి.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ముఖ్యాంశాలు

- పదో తరగతి విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ.

నంద్యాల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు		
మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
గోస్పాడు	5	407
నంద్యాల	7	472
నంద్యాల పట్టణం	13	1,088

ఆదనపు తరగతుల నిర్వహణ, ప్రిపరేషన్, పదో తరగతి పరీక్షల బ్లూప్రింట్ ప్రకారం ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు.

- జనవరి 13, 14, 15 తేదీలు (సంక్రాంతి సెలవులు) మినహా అన్ని రోజులూ అదనపు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.
- సంక్రాంతి సెలవుల్లో ఇంటి దగ్గరే చదువుకునేలా మార్గదర్శకం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.
- ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు సెషన్లలో తరగతులు నిర్వహిస్తున్నారు.
- విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయించి, అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను తీర్చి మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి.

మూల్యాంకన పరీక్షలు బాగా రాశాను



స్వీయ మూల్యాంకనం (ఫార్మేటివ్ పరీక్షలు)-1 బాగా రాశాను. అందులో మంచి మార్కులు సాధించాను. పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. ప్రత్యేక తరగతుల వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉండి విద్యార్థుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నారు. - నాగమహేష్‌రెడ్డి, విద్యార్థి, అయ్యలూరు

పరీక్షలంటే భయం పోయింది



పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పబ్లిక్ తరహాలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలలో తక్కువ మార్కులు వస్తే అందుకు గల కారణాలను తెలుసుకొని సందేహాలను తీరుస్తున్నారు. సిలబస్ అంతా పూర్తిచేసి రివిజన్ చేస్తున్నారు. రోజూ పరీక్షలు నిర్వహిస్తుండటంతో పరీక్షలంటే భయం తొలగిపోయి ధైర్యం వచ్చింది. -హంశిత, విద్యార్థిని, మోడల్ స్కూల్

పక్కాగా యాక్షన్ ప్లాన్ అమలు



ప్రభుత్వ హైస్కూళ్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేసేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. పదో తరగతి పరీక్షల బ్లూప్రింట్ ప్రకారం ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు. సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు వచ్చి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలనే ఆరాటంతో పనిచేస్తున్నారు. - అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం

గోస్పాడు: సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ల ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. గోస్పాడు సచివాలయం వద్ద 5, 6 డీసీలకు, నాల్గవ డీసీకి నంద్యాల పట్టణంలోని కేసీ కెనాల్ డీఈ కార్యాలయం వద్ద ఎన్నికలు నిర్వహించారు. నంద్యాల నియోజకవర్గంలో మూడు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు ఉండగా అందులో నాల్గవ డీసీ చైర్మన్‌గా కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, 5వ డీసీ చైర్మన్‌గా ఇలియాస్, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి, 6వ డీసీ చైర్మన్‌గా శీలంభాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పంజుగల చంద్రశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. ఎన్నికైన చైర్మన్లు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. సాగునీటి సమస్యలు తలెత్తకుండా తమవంతు కృషి చేస్తామన్నారు.

డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం

దొర్నిపాడు: నీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. 7వ డీసీకి సంబంధించి డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఎరువ ప్రసాద్‌రెడ్డి, 8వ డీసీకి రామచంద్రాపురం గ్రామానికి చెందిన బబ్బూరి వెంకటస్వామి ఎన్నికయ్యారు. వారు మంగళవారం అధికారుల నుంచి ధ్రువపత్రాలను అందుకున్నారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేద్దాం

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను ఆదా చేసి భవిష్యత్తు తరాలకు వెలుగునిద్దామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్‌కుమార్ పిలుపునిచ్చారు. విద్యుత్ పొదుపును అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ సుధాకర్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ పొదుపును నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఇంధనం ఆదా చేయడం అంటే వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడమేనని చెప్పారు. బిల్లు అదుపులో ఉంటే వినియోగదారుడికి అదనపు ఖర్చు తగ్గుతుందని సూచించారు. డీఈ శ్రీనివాసరెడ్డి, ఏడీఏలు, ఏడీలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో సత్ఫలితాలు



కోటకొండలో నారుమడి వద్ద రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ నాగేంద్రప్రసాద్

రుద్రవరం: పొలంలో సాగుచేసిన పంటనే మళ్లీ సాగుచేయకుండా, పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాల్లో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్‌లో మొక్క జొన్న సాగు చేసిన వారు తిరిగి రబీలో కూడా అదే పంటను సాగు చేయడం వల్ల భూసారం తగ్గి పోషక లోపాలు, తెగుళ్ల అధికమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే రబీలో వరి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులోపు ఎకరానికి రూ.126 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని, అలాగే ఈ-క్రాప్ చేయించుకోవాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే మండలంలోని రైతులందరు నూనెపల్లెలోని వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలో బుధవారం నిర్వహించే కిసాన్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఏఈఓ రాజు ఉన్నారు.

హైందవ శంఖారావానికి అర్చకుల మద్దతు



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జనవరి 5న జరిగే హైందవ శంఖారావానికి అర్చక సమాఖ్య సంఘం మద్దతు ఉంటుందని ఏపీ అర్చక పురోహిత్ ప్రముఖ్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వివిధ మండలాల అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలకు రెండుసార్లు ఆలయ హారతి కార్యక్రమం ద్వారా భక్త మండలిని ఏర్పాటు చేసి ఆలయ నిర్వహణ, ఆలనా, పాలన చూడాలన్నారు. అర్చకుల సమస్యలు వీహెచ్‌పీ నాయకుల దృష్టికి తీసుకెళితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి పరిష్కార మార్గాలను ఆలోచిస్తామన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి ప్రతి ఒక్క హిందువు హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలేపల్లి సందీప్, అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సమాఖ్య రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 రోజులుగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు అతి తక్కువ జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి స్పందించి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గిరిజన విద్యార్థి సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి ఆధార్ తప్పనిసరి



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ తేజేశ్వరి



కొండమాయపల్లె ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాగ్యలక్ష్మి

ఆళ్లగడ్డ: పుట్టిన ప్రతి చిన్నారికీ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేపట్టాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఆళ్లగడ్డ సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం ఆధార్ నమోదుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందుగా 0 - 5 సంవత్సరాల్లోపు చిన్నారులను గుర్తించి అందులో ఆధార్ కార్డు కలిగిన వారిని, లేనివారిని లెక్కించుకోవాలన్నారు. ఆధార్ లేని వారికి నమోదు చేయాలంటే పుట్టిన తేదీ సర్టిఫికెట్ తప్పనిసరి కావున, ఆ సర్టిఫికెట్ ఎలా పొందాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి

రుద్రవరం: మండలంలోని ఆలమూరు, ముత్తలూరు, కొండమాయపల్లె పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సూచించారు. కొండమాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలోని ఆధార్ శిబిరాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు.

ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 ఏళ్లలోపు చిన్నారులందరికీ కొత్త ఆధార్ కార్డు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థుల వివరాలను నమోదు చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు పదవ తరగతి విద్యార్థుల హాల్‌టికెట్లను సిద్ధం చేసేందుకు విద్యార్థుల వివరాలను తప్పులేకుండా నమోదు చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షలు 2025 ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 16తో ముగిసిందన్నారు. ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అప్లికేషన్లలో అవసరమైన అంశాలలో దిద్దుబాటు చేయడానికి సంబంధిత స్కూల్ లాగిన్‌లలో ఎడిట్ ఎంపిక ప్రారంభించబడిందని, పాఠశాల రికార్డులలో, విద్యార్థి ఆపార్ ఐడీలో పక్కా వివరాలు నమోదు చేయాలని, అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఈఓ సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఈ అంశాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎస్‌ఆర్ డేటా స్కూల్ లాగిన్‌లో సవరణ, విద్యార్థి పేరు, తల్లి, తండ్రి పేర్లు, పుట్టిన తేదీ, విద్యార్థి ఎంచుకున్న భాష, విద్యార్థి మాధ్యమం, విద్యార్థి వైకల్యం, సబ్జెక్ట్ కోడ్‌లు, విద్యార్థుల గుర్తింపు, విద్యార్థి ఫొటో, సంతకం తదితర అంశాలను సరి చేయాలని సూచించారు.

6 నుంచి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు

నంద్యాల(న్యూటౌన్): యాగంటిలో జనవరి 6, 7, 8 తేదీల్లో జరిగే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జిల్లా శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. శిక్షణా తరగతుల్లో శాస్త్రీయ విద్యా వైజ్ఞానిక రంగాల్లో వస్తున్న మార్పుల గురించి చర్చించి, విద్యార్థి వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్తలు, ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని వాపోయారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నెరవాటి రాజా, జిల్లా నాయకులు హర్షవర్ధన్, సందీప్, కిశోర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): భారతీయ వైద్య సంఘం నంద్యాల మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో వైద్యంపై బాలబాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన, కార్యదర్శి అనూష సహకారంతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా డాక్టర్లు కల్పన, రవికృష్ణ, సహదేవుడు, మధుసూదన్ రావు మాట్లాడుతూ ప్రజలతో మమేకం కావడమే తమ లక్ష్యమన్నారు. విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన కల్పించడం ద్వారా వారు తమ కుటుంబాల్లో చుట్టుపక్కల ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీసౌజన్య, వసుధ, నాగమణి, నర్మద, తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణపై సమీక్ష



మాట్లాడుతున్న ఎఫ్‌డీపీ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి: ఆరోగ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని ఎఫ్‌డీపీ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ సమావేశ భవనంలో చాగలమర్రి, ముత్యాలపాడు పీహెచ్‌సీల పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి గర్భిణి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి ఎంసీపీ కార్డు అందజేయాలన్నారు. గత నెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన ఎన్‌సీడీసీడీ-3.0 సర్వేపై ఆరా తీశారు. ప్రతి కుటుంబంలో ఉన్న సభ్యులందరికీ బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఎత్తు, బరువులాంటి పరీక్షలు నిర్వహించి వాటితో పాటు బ్రెస్ట్, నోటి, సర్వైకల్ క్యాన్సర్ పై అవగాహన కలిస్తూ సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ వెంకటరమణ ఆదేశాల మేరకు వైద్యాధికారిణి అంజలి నుంచి డీడీఓ ఇన్‌చార్జ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వైద్యాధికారిణులు పి.అంజలి, తస్లీమా సుల్తానా, సీహెచ్ఓ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి





మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, మాట్లాడుతున్న డీఎల్‌పీఓ, పరిశీలకులు రాంబాబు

నంద్యాల(అర్బన్): గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సుస్థిరాభివృద్ధిపై గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదాయ వనరులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి శిక్షణ

చాగలమర్రి: పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్నీ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి 2 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు నంద్యాల డీఎల్‌పిఓ, పరిశీలకులు రాంబాబు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ విడత ఎల్‌ఎస్‌డీజీఎస్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీపీసీ తరపున వివిధ శాఖలకు చెందిన మండల అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్‌లతో మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మాస్టర్ ట్రైనర్‌లు ఈఓపీఆర్‌డీ తాహీర్‌హుసేన్, ఎంఈఓ అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏఈ జగ్గయ్య, వ్యవసాయాధికారి రంగనేతాజి, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు



సర్వాయిపల్లెలో గ్రామసభకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన రెండవ విడత రెవెన్యూ గ్రామ సభలకు రైతుల నుంచి స్పందన కరువైంది. మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో 256 మంది రైతులకు సంబంధించి 1,461 ఎకరాల్లో భూముల రీ సర్వే చేపట్టవలసి ఉంది. అయితే గ్రామసభకు కేవలం 12 మంది రైతులు మాత్రమే హాజరయ్యారు. వారిలో ఒక్క రైతు మాత్రమే భూ సమస్యపై అధికారులకు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సర్వేయర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు రాజకీయ నాయకులతో సభను మమ అనిపించారు.

జీనేపల్లెలో రెవెన్యూ సదస్సు

శిరివెళ్ల: మండలంలోని జీనేపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూముల ఆన్‌లైన్‌కు 2 అర్జీలు, భూ వ్యత్యాసంపై సర్వే కోసం 3, పేరు సవరణకు ఒకటి చొప్పున తహశీల్దార్ పుష్పకుమారికి రైతులు అర్జీలు పెట్టుకున్నారు. ఈ డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్, సర్వేయర్ చిన్న మల్లయ్య, వీఆర్వో రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడాపోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ నిర్మల్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, తద్వారా జీవిత ఆశయాలను సాధించడంలో విజేతలుగా నిలుస్తారని ఎస్‌బీయూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఏ.నిర్మల్‌కుమార్, చైర్మన్ బీవీఎస్ హరినాథ్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల 27వ రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024-25 (ఐపీఎస్‌జీఎం) నిర్వహించగా 12 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 396 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ అధ్యక్షత వహించారు. అతిథులు మాట్లాడుతూ.. క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో జీవీఆర్ శ్రీశైలం, వాసవీ పాలిటెక్నిక్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో వాసవీ పాలిటెక్నిక్ విద్యార్థులు ఫైనల్‌కు చేరుకున్నారు. విద్యావేత్త రామకృష్ణారెడ్డి, రాజేష్, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, సురేష్‌బాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. హాజరైన క్రీడాకారులందరికీ భోజన వసతి ఏర్పాటు చేశారు.